## క్లుప్తంగా

### కుంకుళ్లమ్మకు డీపీవో ప్రత్యేక పూజలు



కుంకుళ్లమ్మను దర్శించుకుంటున్న డీపీవో

**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన, క్షేత్ర దేవతగా విరజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని జిల్లా పంచాయితీ అధికారిణి కె.అనురాధ బుధవారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమె ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో కొలువైన కుంకుళ్లమ్మను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీపీవో వెంట ఈవోపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులున్నారు.

### ఎంపీడీవోకు అభినందనలు



ఎంపీడీవోను సత్కరిస్తున్న సర్పంచ్‌ల చాంబర్ సభ్యులు

**కొయ్యలగూడెం:** ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన కె.కిరణ్‌కుమార్ ను సర్పంచ్‌ల చాంబర్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని, సమస్యలను పరిష్కరించడానికి పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సభ్యులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాజవరం సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, బయ్యనగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మీ, అచ్చుతాపురం సర్పంచ్ మద్దిపాటి నాగమణి, కన్నాపురం సర్పంచ్ ఉప్పల పద్మావతి, దిప్పకాయపాడు సర్పంచ్ సున్నం శాంతి కుమారి, బోడిగూడెం సర్పంచ్ కడకట్ల గద్దయ్య, పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కిషోర్

**జంగారెడ్డిగూడెం:** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం కోర్టు ప్రాంగణం నుంచి ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్ త్రీ కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాజంలో బయట చిన్న చిన్న షాపుల్లోగాని, హోటల్లో గాని వివిధ కర్మాగారాల్లో గాని పని చేస్తున్న ప్రతి బాలలను గుర్తించి, పాఠశాలకు పంపేలా కృషి చేయాలన్నారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కేఎస్ఆర్ తేజస్వి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు వారి పిల్లలను కర్మాగారాల్లో పని చేయించకుండా వారిని పాఠశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో

**కొయ్యలగూడెం:** ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో ఎ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలంలో గుర్తించిన 84 పనులకు గాను రూ.6.37 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుర్తించిన వివిధ పనుల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు.

### మోదీ అమిత్‌షాలు బీజేపీకి బలం

**కొయ్యలగూడెం:** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాల ద్వయం బీజేపీకి బలమని ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం సీతంపేటలో నిర్వహించిన బీజేపీ స్థూపం, పతాకా విష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# అటకెక్కిన వంతెన నిర్మాణం

## 2018లో కూలిపోయిన హేవలాక్ బ్రిడ్జి



జంగారెడ్డిగూడెం బైనేరు వాగుపై నిర్మించిన హేవలాక్ వంతెన కూలిపోయిన ప్రాంతం

**జంగారెడ్డిగూడెం:** పట్టణం నుంచి జాతీయ ప్రధాన రహదారిని కలిపే మార్గాల్లో కొవ్వూరు రోడ్డులోని బైనేరు వాగుపై ఉన్న హేవలాక్ వంతెన ఒకటి. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాడు నిర్మించిన వంతెన ఎన్నో దశాబ్దాలుగా సేవలందిస్తూ 2018లో కూలిపోయింది. నాటి నుంచి నేటి వరకు బ్రిడ్జిని పునర్ నిర్మించే పనులే చేపట్టలేదు. జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి నరసన్నపాలెం వై.జంక్షన్ వద్ద జాతీయ ప్రధాన రహదారిని చేరుకునేందుకు వీలుగా ఈ వంతెన ఉండేది. వంతెన కూలిపోవడంతో ఫైర్ స్టేషన్ పక్కనే ఉన్న మట్టి రహదారిని వినియోగించాల్సి వస్తోంది. మట్టి రహదారి గోతుల మయంగా ఉండటం, రహదారిని అనుకొని ఇళ్ల ఉండటంతో ప్రయాణించే వారు. ఇళ్లలో నివాసం ఉండేవారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బైనేరు వాగుపై రహదారిని నిర్మించాలని ప్రజలు విన్నవించుకుంటున్నా నేటికీ అది సాకారం కాలేదు. బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి జరుగుతుందోనని ప్రజలు వాపోతున్నారు.

**టెండర్ల వరకే పరిమితం**

జంగారెడ్డిగూడెం బైనేరు వాగుపై కూలిపోయిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేసేందుకు ప్రభుత్వ అనుమతులు మంజూరయ్యాయి. రెండు, మూడు సార్లు టెండర్లు పిలిచారు. రూ.3.50 కోట్ల నిధులు నిర్మాణం కోసం కేటాయించారు. నరసాపురం–అశ్వారావుపేట రోడ్డు విస్తరణలో భాగంగా 23.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్డు పనుల్లోనే బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.50 కోట్లు కేటాయించారు. బ్రిడ్జి నిర్మాణానికి విడిగా టెండర్లు పిలిచారు. అయితే టెండర్లకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాత పనులు ఆపేయాలని ఆదేశించడంతో బ్రిడ్జి నిర్మాణం ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా టెండర్లు పిలిస్తే గత అంచనాను మించి రూ.1.30 కోట్లు అధికంగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని, రూ.4.80 కోట్లు ఖర్చు అవ్వొచ్చని అంచనా. కొత్తగా ప్రతి పాదనలు చేసి టెండర్లు పిలవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

**హేవలాక్ బ్రిడ్జి ప్రస్థానం :** 1913 సంవత్సరంలో బ్రిటీష్ కాలంలో హేవలాక్ బ్రిడ్జిని జంగారెడ్డిగూడెం బైనేరు వాగుపై నిర్మించారు. బ్రిటన్‌కు చెందిన రాయల్ నేవీ ఇంజనీర్లు ఈబీ ఎల్విన్ ఇస్కు, వీటీ జాన్‌లు రెవెన్యూ సర్వే నెంబర్ 250లో నిర్మాణం చేశారు. స్థంభాలు లేకుండా స్కాట్ లాండ్ నుంచి తెప్పించిన స్టీల్‌గడ్డలతో బ్రిడ్జిని నిర్మాణం చేశారు. 105 ఏళ్ల పాటు సేవలందించిన బ్రిడ్జి 2018 ఆగస్టు 18న వచ్చిన వరదలకు కూలిపోయింది.

### వంతెన నిర్మాణం చేపట్టాలి



జంగారెడ్డిగూడెం బైనేరు వాగుపై వరదలకు కూలిపోయిన వంతెన ప్రాంతంలో కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి. పోలవరం, చింతలపూడి నియోజకవర్గ ప్రజలతో పాటు, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రా ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఈ వంతెన ఉపయోగపడేది. ఆగస్టు 18, 2018 సంవత్సరంలో సంభవించిన వరదలకు గట్టు కోతకు గురై వంతెన కూలిపోయింది. వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి.

– కోరిమిల్లి నాగరాజు, జంగారెడ్డిగూడెం

### అనేక ఇబ్బందులు పడుతున్నాం



జంగారెడ్డిగూడెం బైనేరు వాగుపై స్టీల్ గడ్డర్ బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే జాతీయ రహదారిపై వేరొక వంతెన ఉన్నా రాకపోకలు రద్దీతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. స్టీల్ గడ్డర్ బ్రిడ్జి ఉన్నప్పుడు రాకపోకలు సాగించడానికి ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త వంతెన నిర్మించాలని వేడుకుంటున్నాం.

– కొల్లా సత్యనారాయణ, తిరుమలాపురం

### ఆర్‌అండ్‌ఆర్ భూ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

**బుట్టాయగూడెం:** మండలంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ భూములకు సంబంధించి స్థానిక గిరిజనులకు, నిర్వాసిత గిరిజనులకు మధ్య నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని గిరిజన సంఘం నాయకురాలు చోడెం దుర్గ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ సంఘ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో భూ సమస్యల వలన గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిర్వాసితుల కోసం భూములు సేకరించే సమయంలో సమగ్రమైన రికార్డులను పరిశీలన చేయకుండా భూములు సేకరించారన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో నిర్వాసిత గిరిజనులకు, స్థానిక గిరిజనులకు గొడవలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ భూ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెల్లం మునీశ్వరరావు, మడకం గంగరాజు, బుద్దుల ముత్యాలమ్మ, పద్దం దుర్గారావు, తెల్లం సాయి, కోర్సా ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు




కామవరపుకోట: కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ముత్యాలరావు



కొయ్యలగూడెం: సరిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**కామవరపుకోట:** ప్రకృతి వ్యవసాయంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందొచ్చని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు. బుధవారం మండలంలో తడికలపూడి కేఎస్ రామవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.పవన్‌కుమార్, పశువైద్యాధికారి ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది.**

**కొయ్యలగూడెం:** సరిపల్లి, కన్నాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.చెన్నకేశవుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీఏ పి.బుజ్జిబాబు పాల్గొన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువుల పిచికారీ విధానం మీద డెమో చేసి చూపించారు. సేంద్రియ వ్యవసాయం గురించి వెటర్నరీ డాక్టర్ బీఆర్ శ్రీనివాస్ పశు సంవర్ధకశాఖలోని స్కీమ్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కన్నాపురం ఎంపిటిసి బాజీ, సరిపల్లి మాజీ ఎంపీటీసీ మట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

**వరి పంటల పరిశీలన**

**బుట్టాయగూడెం:** మండలంలోని జైనవారిగూడెం, ఇప్పలపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో డి.ముత్యాలరావు రైతులతో కలిసి వరిపంట పొలాలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. జైనవారిగూడెం సర్పంచ్ తాతి సీత, రైతులు కొవ్వాసి రాముడు, ఏనుగుల శ్రీనివాస్, నాగరాజు, తెల్లం దుర్గారావు, పి.ముక్కయ్య, పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రత్యేక కృషి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు

**బుట్టాయగూడెం:** ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాట తప్పడం, మడమ తిప్పడం తెలియదన్నారు. కూటమి పాలకులు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. 100 రోజుల కూటమి పాలన పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోగా ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.చివరికి వరదల్లో తప్పుడు లెక్కలు చూపించి, కూటమి నేతలు మింగేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తక్కువ ధరలకే ప్రతి ఒక్కరికీ ఇసుక లభిస్తే కూటమి పాలనలో ఉచిత ఇసుక అంటూ అసలు ఇసుకే అందకుండా చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కూటమి పాలకులే ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారన్నారు. కూటమి పాలకులు గ్రామ గ్రామాన మద్యాన్ని ఏరులై పారే విధంగా చేస్తున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ పిలుపును అందిపుచ్చుకొని ఆయా కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తామని చెప్పారు. నేతలు సమిష్టిగా పాల్గొని కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారని తెలిపారు.

**ఘనంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం**

**కొయ్యలగూడెం:** వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నట్లు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా ఏలూరు పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండలాల కన్వీనర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారన్నారు.

### ఫ్రీజర్ బాక్స్ అందజేత

**కొయ్యలగూడెం:** కన్నాపురానికి ఫ్రీజర్ బాక్స్‌ను ఈడ్పుగంటి మనోహర్ చౌదరి బుధవారం అందజేశారు. ఇంటర్నేషనల్ కమ్మ సంఘం ఫౌండేషన్ చైర్మన్ హైదరాబాద్ వారితో మాట్లాడి బాక్స్‌ను కన్నాపురానికి తెప్పించినట్లు ఆయన తెలిపారు. పవన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మైనేని సాయిబాబు దీనికి కృషి చేశారన్నారు. కన్నాపురం గ్రామ సర్పంచ్ ఉప్పల పద్మావతి, ఉప సర్పంచ్ మొహమ్మద్ ముంతాజ్ బేగం, ఎంపీటీసీలు షేక్ బాజి తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సోలార్ పవర్‌ప్లాంట్‌కు స్థల పరిశీలన



తహసీల్దార్‌కు సూచనలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

**ద్వారకాతిరుమల:** మండలంలోని వెంకటకృష్ణాపురంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. అంతకు ముందు ఆమె ద్వారకాతిరుమలలోని ఆర్ఎస్ నెంబర్ 47లో నాయీ బ్రాహ్మణ సంఘ కల్యాణ మండప నిర్మాణానికి కేటాయించిన అరెకరం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ జేవీ సుబ్బారావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంకట కృష్ణాపురానికి చేరుకొని సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం నిమిత్తం ఆర్ఎస్ నెంబర్ 385లోని స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గాలీబ్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సరస్వతీదేవిగా దుర్గమ్మ

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు




చింతలపూడి: విశ్వనాథ మఠంలో సరస్వతీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి



ద్వారకాతిరుమల: సరస్వతీదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



కొయ్యలగూడెం: హంసవాహిని అలంకరణలో కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం: సరస్వతీదేవి అలంకరణలో ముత్యాలమ్మ



జంగారెడ్డిగూడెం రూరల్: పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న భక్తులు



పోలవరం రూరల్: సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**జంగారెడ్డిగూడెం:** దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణంలో పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రకాల అలంకరణల్లో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో సరస్వతిదేవిగా అలంకరించి, విద్యార్థులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనూకాలమ్మను లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. శ్రీ గంగానమ్మ అమ్మవారు, నూతన మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో కొలువైన శ్రీచక్ర సహిత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి, శ్రీ విజయ దుర్గమ్మ అమ్మవారికి, హైస్కూల్ వద్ద దుర్గమ్మ అమ్మవారు, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**విశ్వనాథ మఠంలో..**

**చింతలపూడి:** మండలంలో పలు గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరీ అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళా భక్తులు ఆశ్రమానికి చేరుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 12 వరకూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు విశ్వనాథ మఠం ఈవో సాంబశివరావు తెలిపారు.

**అక్షరాభ్యాసాలు, ప్రత్యేక పూజలు**

**జంగారెడ్డిగూడెం రూరల్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం కావడంతో మండలంలోని అమ్మవారి ఆలయాల్లో సరస్వతీదేవి పూజలు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. గురవాయిగూడెం రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అక్షరాభ్యాసాలు, సరస్వతీదేవి పూజలను అర్చకులు చిన్నారులచే చేయించారు. అలాగే అయ్యప్పక్షేత్రంలో ఉపాలయంలో కొలువైన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారికి అర్చకులు తేజశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభాస్య కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**హంస వాహినిగా కనకదుర్గమ్మ**

**కొయ్యలగూడెం:** దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మ హంస వాహిని అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి జన్మ నక్షత్రం కావడంతో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అర్చకులు అలంకరించారు. కొయ్యలగూడెం బయ్యన్నగూడెం గ్రామాల్లోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ వాగ్దేవి అలంకరణతో అదే విధంగా కన్నాపురం అచ్చుతాపురం గవరవరం వై జంక్షన్‌లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సామూహిక కుంకుమ పూజలు**

**పోలవరం రూరల్:** శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కనకదుర్గ అమ్మవారి సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం రాత్రి రెండు పూటలా కుంకుమ పూజ నిర్వహించారు. పాత పట్టిసీమ గ్రామంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయాల వద్ద లలితా సహస్ర పారాయణలు నిర్వహించారు. భక్తులు దేవాలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

**సరస్వతీ నమస్తుభ్యం**

**ద్వారకాతిరుమల:** చదువుల తల్లి సరస్వతీ దేవిగా క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు, అలాగే స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మూలానక్షత్రం కావడంతో అమ్మవార్లు ఈ ప్రత్యేక అలంకరణలో భక్తులను కటాక్షించారు. కుంకుళ్లమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు అభయ ప్రదానం చేస్తున్నారు. వీణాపాణి అయిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తరించారు.

# ఇదేనా స్వచ్ఛతా హీ సేవ ?



ఎంపీడీవో కార్యాలయం ఎదుట మురికి గుంట

**వేలేరుపాడు:** స్వచ్ఛతా హీ సేవ, స్వభావ్ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత, క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట పరిశుభ్రమైన ప్రభుత్వంగా ఊరూరా చెప్పుకుంటూ ఫొటోలకు అధికారులు ఫోజులిస్తున్నారు. తమ కార్యాలయాల విషయాని కొస్తే అధికారులు స్వచ్ఛతా హీ సేవ ఆచరించడం లేదు. ఇందుకు వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయం సాక్షాత్కరిస్తుంది. ఈ కార్యాలయ ఆవరణలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కార్యాలయం ఎదుట పెద్ద మురికి గుంట ఉంది. ఈ గుంటలో నీరు నిలిచి ఉన్నప్పటికీ, ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కార్యాలయం చుట్టూ మురుగు నీరు, చెత్త, చెదారం పేరుకుపోయాయి. చెత్త, చెదారం పేరుకుపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మురికి గుంటలు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయి. నలుగురికీ పరిశుభ్రత గురించి చెప్పి, అవగాహన కల్పించాల్సిన అధికారుల కార్యాలయాల పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి చెప్పనక్కర్లేదు.